సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం । 30 । జనవరి । 2024



ఎత్తిపోతలకు సన్నాహాలు

పేట- కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభంపై ఆశలు చిగురిస్తున్నాయి.

వివరాలు 8లో ▸



బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతుంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /17.4

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: స్థానిక రాయచూర్ **రోడ్డు పక్కన** నిర్మించిన 132/33 కేవీ సబ్**స్టేషన్‌కు మర**మ్మతు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏడీఏ గోవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ, గట్టు, మల్దకల్, రాజోళి మండలాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్టాఫ్‌నర్సు ఫలితాల్లో సత్తా

- మండలం నుంచి 9మంది ఎంపిక

మానవపాడు: రాష్ట్రంలో 7094 స్టాఫ్ నర్సు పోస్టులకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల కాగా.. వీరిలో మానవపాడు మండలానికి చెందిన 9మంది సెలెక్ట్ అయ్యారు. మండల కేంద్రానికి చెందిన సాధిక్, ముర్తుజా, శిరీష, రాధ, జల్లాపురానికి చెందిన శ్రీకాంత్, తారమని, చందూరులో ప్రశాంతి, అమరవాయికి చెందిన రాజ్యాలక్ష్మి, బోరవెల్లిలో ఈర్లదిన్నె ప్రియాంక, స్టాఫ్ నర్స్‌లుగా ఎన్నికయ్యారు. దీంతో కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

వేరుశనగ క్వింటా రూ.6,760



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 1699 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6,760, కనిష్టం రూ.3311, సరాసరి రూ.5069 ధరలు పలికాయి. అలాగే, 15 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 5489, కనిష్టం రూ. 5341, సరాసరి రూ.5460 ధరలు వచ్చాయి. అలాగే, 3 క్వింటాళ్ల వరి (సోన) గరిష్టం, కనిష్టం, సరాసరి రూ.3050 ధర పలికింది. 66 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ. 9806, కనిష్టం రూ. 6819, సరాసరి రూ. 9669 ధరలు పలికాయి.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లా జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కోచ్ సాధిక్‌అలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో వచ్చేనెల 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరుగుతాయని, పూర్తి వివరాల కోసం సెల్ నం.88973 78248ను సంప్రదించాలని సూచించారు.

మత్తు.. వదలాల్సిందే!



మెడికల్ షాపులపై నిఘా

- ఉమ్మడి జిల్లాలో నార్కోటిక్ డ్రగ్స్ అమ్మకాలపై ప్రత్యేక దృష్టి
- ఇకపై నెలలో నాలుగు రోజులపాటు ఆకస్మిక తనిఖీలు
- పాలమూరులో మెడికల్ దుకాణాలపై వలసదారుల పెత్తనం
- స్థానిక నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం
- ఇకనైనా నిబంధనలు పాటిస్తారా అని అనుమానాలు



మహబూబ్‌నగర్‌లోని ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

జోన్	మెడికల్ దుకాణాలు	ఏజెన్సీలు	దుకాణం కం ఏజెన్సీ
జడ్చర్ల	211	14	5
మహబూబ్‌నగర్	372	231	38
నాగర్‌కర్నూల్	286	30	4
వనపర్తి	325	52	10
నారాయణపేట	241	15	5

పాలమూరు:

మెడికల్ దుకాణాలు, ఏజెన్సీల్లో మత్తు మందుల (నార్కోటిక్ డ్రగ్స్) విక్రయాలపై ప్రభుత్వం నిఘా తీవ్రతరం చేసింది. హైదరాబాద్‌తోపాటు ఇతర జిల్లాలోనూ వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని గుర్తించింది. దీంతో మత్తు మందుల విక్రయాలపై, నకిలీ డ్రగ్స్ నిర్మూలనపై తనిఖీలు నిర్వహించాలని ఇటీవల రాష్ట్ర డ్రగ్స్ నియంత్రణ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధికారులు మెడికల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేయడానికి సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే తనిఖీలు చేపట్టగా.. ఇంకా ముమ్మరం చేయనున్నారు. గత నెలలో కూడా కొన్ని మెడికల్ దుకాణాలు, ఏజెన్సీలను అధికారులు తనిఖీ చేసి వైద్య, ఆరోగ్య శాఖకు నివేదిక పంపించారు. ఇకపై అన్ని జిల్లాల్లోనూ నెలలో నాలుగు రోజులపాటు ఆకస్మిక తనిఖీలు చేసి ఎప్పటికప్పుడు మెడికల్ దుకాణాలు, ఏజెన్సీల్లో ఉన్న నిల్వలపై నివేదిక సమర్పించాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు బృందాలుగా మారి క్షేత్రస్థాయిలో ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రధాన పట్టణాల్లో ఉండే మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టనున్నారు. అదేవిధంగా ప్రతి దుకాణం దగ్గర నిబంధనలతో కూడిన పోస్టర్లు, బ్యానర్లు, అధికారులకు ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 6969 ఏర్పాటు చేశారు.

సిబ్బంది కొరత..

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఆరు జోన్లు ఉండగా.. ఇందులో ఇద్దరు రెగ్యులర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, మరో ఇద్దరు ఇన్‌చార్జ్‌లు పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్ డీఐ మహబూబ్‌నగర్‌తో పాటు వనపర్తి, జడ్చర్ల డీఐ గద్వాల పర్యవేక్షిస్తున్నారు. నారాయణపేటకు వికారాబాద్ డీఐ ఇన్‌చార్జ్ ఉండగా.. నాగర్‌కర్నూల్‌కు రాజేంద్రనగర్ డీఐ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాను ఏడీ పర్యవేక్షిస్తుంటారు. సిబ్బంది కొరత ఉండటంతో సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందన్న ఆరోపణలు ఉన్నాయి.

టోకు విక్రయ కేంద్రాలపై..

ఉమ్మడి జిల్లాలో 2,169 డ్రగ్స్ విక్రయించే కేంద్రాలు ఉంటే వీటిలో మెడికల్ దుకాణాలు 1,718, ఏజెన్సీలు 371, మెడికల్ దుకాణం అండ్ ఏజెన్సీ కలిపి 75 ఉన్నాయి. వీటికి ప్రధానంగా మహబూబ్‌నగర్‌లోని 231 ప్రధాన మెడికల్ ఏజెన్సీల నుంచి డ్రగ్స్ తరలిస్తుంటారు. తాజా ఆదేశాల నేపథ్యంలో అధికారులు ఎక్కువగా ఏజెన్సీలపై దృష్టిసారించారు. నార్కోటిక్ డ్రగ్స్, ప్రభుత్వం నిషేధించిన డ్రగ్స్ దిగుమతి చేసుకుంటున్నారా.. అనే అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నారు.

కేసులు నమోదు చేస్తాం..



ఉమ్మడి జిల్లాలోని మెడికల్ దుకాణాల్లో మత్తు మందుల విక్రయాలను తనిఖీ చేయడానికి ప్రతినెలలో కొన్ని రోజులు కేటాయించాం. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయించొద్దు. డ్రగ్స్ వివరాల్లో తేడా ఉంటే నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపుతున్నాం. నిషేధిత మందులు విక్రయిస్తే దుకాణాన్ని మూసివేసి యజమానిపై కేసు నమోదు చేస్తాం.

– దినేష్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ

అమలు కాని నిబంధనలు

ఉమ్మడి పాలమూరులో మత్తు మందుల విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రధానంగా పాలమూరులో మత్తు డ్రగ్స్‌ను ఇష్టారాజ్యంగా అమ్ముతున్నారు. కొందరు ఇతర జిల్లాల నుంచి పాలమూరుకు వలస వచ్చి స్థానికంగా మెడికల్ దుకాణాలను తమ ఆధీనంలో పెట్టుకున్నారు. వారి కనుసన్నల్లో విక్రయాలు జరుగుతున్నాయి. నిద్ర మాత్రలు, మత్తు కలిగించే దగ్గు మందు టానిక్, ఇన్‌ఫెక్షన్ ఉన్నవారికి ఇచ్చే యాంటీబయోటిక్స్ మందులను వైద్యుల సిఫారసు లేకుండానే విక్రయిస్తున్నారు.

- వైద్య, ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా ఎలాంటి డ్రగ్ విక్రయించరాదు. కానీ, మెడికల్ దుకాణాల నిర్వాహకులు ఈ నిబంధనను ఏమాత్రం పట్టించుకోవడం లేదు.
- ప్రతి మెడికల్ దుకాణంలో తప్పనిసరిగా ఫార్మసిస్టులను నియమించుకోవాలి. కానీ, చాలా దుకాణాల్లో డ్రగ్స్‌పై కనీస అవగాహన లేనివారిని పెట్టుకుంటున్నారు. పదో తరగతి, ఇంటర్ చదివిన వారికి తక్కువ వేతనాలు చెల్లిస్తూ పని చేయించుకుంటున్నారు.
- దుకాణ సిబ్బందికి డ్రగ్స్‌పై ఎలాంటి అవగాహన లేకపోవడంతో ఒక మందు బదులు మరో మందు ఇవ్వడంతో రోగులు మరింత అనారోగ్యం బారిన పడిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం మత్తు మందుల విక్రయాలపై తనిఖీలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఔషధ దుకాణాల్లో పూర్తిస్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చూడాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై పెండింగులో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 74ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భూసంబంధ, పింఛను, సమస్యలపై రాగా.. ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపినట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వారంలోపు పరిష్కరించాలని, ఒక వేళ పరిష్కరించని యెడల అందుకు గల కారణాన్ని పేర్కొంటూ సంబంధిత ఫిర్యాదుదారునికి అక్నాలెడ్జ్‌మెంట్ పంపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. 18సంవత్సరాలలోపు ఉన్న ఆడపిల్లలు, 21 సంవత్సరాలలోపు ఉన్న మగపిల్లలకు వివాహాలు చేయవద్దని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు వద్దని పేర్కొంటూ 'వద్దు మాకు పెళ్లి, బడికే పోతాం మేం ' నినాదంతో కూడిన వాల్‌పోస్టర్లను ఐడీవోసీ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. బాల్యవివాహాలు ప్రోత్సహించే వారికి చట్టరీత్యా 2సంత్సరాల జైలుశిక్ష, రూ.1లక్ష జరిమాన విధించబడుతుందన్నారు. బ్యాలవివాహాలు చేస్తున్నట్లయితే వెంటనే 100 నంబర్‌కు కాని, 1098 నంబర్‌కు కాని తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు సాయికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్పీ

గద్వాల క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 8 ఫిర్యాదులు అందాయి. వివిధ మండలాలకు చెందిన వారు తమ గోడును ఏఎస్పీ రవి ఎదుట వెళ్లబోసుకున్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. సివిల్ సమస్యలను కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాలని, మిగతా ఫిర్యాదులపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి



సర్పంచులను సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ నేతృత్వంలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేసినట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత పార్టీ అధినేత కేసీఆర్ సారథ్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు వివరించారు. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఐదేళ్లపాటు గ్రామ సర్పంచులుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడిన మీరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, కేసీఆర్ పదేళ్ల పరిపాలనలో మనమందరం భాగస్వాములు కావడం గర్వకారణమన్నారు. రాబోయో రోజుల్లో ఇదే స్ఫూర్తితో పని చేసి బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. అనంతరం ఐదేళ్ల సర్పంచ పదవికాలాన్ని పూర్తిచేసుకున్న సర్పంచులను మెమెంటో, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మున్సిపల్ చైర్మన బీఎస్ కేశవ్, గట్టు తిమ్మప్ప, జంబురామన్‌గౌడ, బాసుహనుమంతు, శ్యామల, ప్రభాకర్‌రెడ్డి, పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నిపాడు రోడ్డు, బ్రిడ్జి పనులు చేపట్టేలా కృషి



గోకులపాడులో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు నుంచి చంద్రశేఖర్‌నగర్ స్టేజీ వెళ్లే రహదారి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. సోమవారం మండలంలోని గోకులపాడు గుడి నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఈసందర్భంగా చెన్నిపాడు వెళ్లే రహదారి వల్ల కలిగే ఇబ్బందులను నాయకులు సీతారామిరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, తిరుమాల్‌రెడ్డి, రాజారెడ్డి, రఘురెడ్డి ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన చల్లా వెంకట్రామిరెడ్డి రోడ్డు పనులకు అంచనా వేయించాలని నాయకులకు సూచించారు. అదేవిధంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యల పరిష్కారం చేస్తానని తెలిపారు కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, గొల్ల వెంకట్రాముడు, దామోధర్‌రెడ్డి, ప్రకాశంగౌడ్, మాజి సర్పంచ్ నరసింహులు, సీతారామిరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, సంజీవ నాయుడు, శేషినాయుడు, రామాంజనేయులు తదితరులు పాల్గోన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ప్రశాంత్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి రూ.7 వేల కోట్ల మేర బకాయిలు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు వెంటనే సొంత భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. భరత్, నందు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

తప్పులతో తిప్పలు

- టీ–నేతన్న యాప్‌లో చేనేత కార్మికుల వివరాలు నమోదు
- పలు సంక్షేమ పథకాలు అందించేందుకు వీలుగా యాప్ రూపకల్పన
- వివరాల నమోదులో దొర్లిన తప్పులు
- సవరణల కోసం కార్మికుల ఎదురుచూపులు



రాజోళిలో నేతన్న యాప్ ద్వారా వివరాల నమోదు చేస్తున్న అధికారులు

రాజోళి: చేనేత కార్మికులకు పథకాలను అమలు చేసేందుకు తీసుకువచ్చిన టీ–నేతన్న యాప్‌తో కార్మికులకు పాట్లు తప్పడం లేదు. వివరాల నమోదులో బాగంగా జిల్లాలో కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవడంలో జరిగిన తప్పులతో వివరాలు తారుమారై తమకు అందాల్సిన పథకాలకు ఎక్కడ ఆటంకం కలుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ముందు చేనేత జౌళి శాఖ అధికారులు ప్రవేశపెట్టిన యాప్‌తో కార్మికుల వివరాలు ఆన్‌లైన్లో పొందుపరచబడి, వారికి పథకాలు అందించేందుకు వీలుగా వివరాల సేకరణకు సాధ్యమయ్యే విధంగా ఈ యాప్ రూపొందించారు. దీని కోసం అధికారులు జిల్లాలోని చేనేత కార్మికులకు తమ ఫోన్ ద్వారానే వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన సైతం కల్పించారు. అయినప్పటికీ వివరాల నమోదులో కార్మికులు నానా పాట్లు పడ్డామని వాపోతున్నారు.

వివరాలు తారుమారు

కార్మికులు తమ వివరాలను చాలావరకు తప్పుగా నమోదు చేసుకున్నారు. కార్మికుడు అని నమోదు చేయాల్సిన చోట వర్కర్ అని, వర్కర్ ఉన్న చోట కార్మికుడు అని నమోదు చేయడంతో పాటు నెంబర్లు కూడా మార్చి వేయడంతో వివరాలు తారుమారయ్యాయి. వివరాలు నమోదు చేశాక యాప్ లాక్ కావడంతో కార్మికులు చేసేదేమి లేక అధికారులను ఆశ్రయిస్తున్నారు. జియో ట్యాగింగ్ నెంబర్లతో పాటు కార్మికుల వివరాలే పూర్తిగా తారుమారు అవటంతో తమకు రావాల్సిన పథకాల, సబ్సిడిల విషయంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయోనని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 5,454 మంది చేనేత కార్మికులు తమ వివరాలు నమోదు చేసుకున్నారు. అందులో వీవర్స్‌గా 2,670, వర్కర్లుగా 2,784 మంది వివరాలు నమోదు చేసుకున్నారు. దాదాపు 1500 మంది దాకా తమ వివరాలను తప్పులుగా నమోదు చేసుకోవడం అధికారులను కూడా విస్మయానికి గురి చేస్తుంది. దాదాపుగా వివరాల నమోదు పూర్తి కావడంతో, ఇక మిగిలిందంతా అధికారుల పనే కావడంతో తమకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

టీ- నేతన్న యాప్‌తో ఇలా..

టీ నేతన్న యాప్‌ను కార్మికుల స్మార్ట్ ఫోన్ ద్వారానే ఇన్‌స్టాల్ చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. వారు చేనేత కార్మికుడా, లేక కూలీనా అనే ఆప్షన్‌తో పాటు జియో ట్యాగింగ్ నెంబర్ లేని వారు కొత్త నెంబర్‌ను కూడా తీసుకునే అవకాశాన్ని కల్పిస్తూ యాప్ తయారు చేశారు. ఈ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవడం వల్ల కార్మికులకు ప్రభుత్వం నుండి అందే చేనేత మిత్ర, చేనేత సబ్సిడి, త్రిఫ్ట్ ఫండ్ తదిదర స్కీంలతో పాటు పూర్తి పథకాల వివరాలను తెలుసుకోవడం, వారికి అందుతున్నాయా లేదా అనే అంశాలను కూడా పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. కార్మికులకు కూడా సంబందిత సమాచారం తెలస్తుంది.దీంతో చేనేత కార్మికులకు దళారుల బెడద కూడా తగ్గుతుంది. నేరుగా ఆన్‌లైన్ ద్వారా తమ పథకాల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. దీని కోసం జిల్లాలో ఎన్నికలకు ముందు కార్మికుల వివరాల నమోదు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ రావడంతో మళ్లీ ఎన్నికల అనంతరం ప్రారంభమైంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం చివరి గడువు పూర్తి అయినప్పటికీ..ఇంకా జిల్లాలో కార్మికుల వివరాలు నమోదు అవుతున్నాయి.


కార్మికుల ఆందోళన



టీ నేతన్న యాప్ ద్వారా కార్మికులకు జరిగే మేలు చాలా ఉంది. కాని వివరాల నమోదులో భాగంగా కార్మికులు తమ వివరాలు తప్పులుగా నమోదు చేసుకున్నారు. ఒకదాని స్థానంలో మరొక దాన్ని నమోదు చేయడం, నెంబర్ మార్పు జరగడం వంటి తప్పులు జరిగాయి. వీటి వల్ల కార్మికులకు పథకాల అమలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కార్మికుల్లో ఆందోళన నెలకొంది. అధికారులు వాటిని సరి చేయాలి.

– మనోహర్, చేనేత కార్మికుడు, రాజోళి

ఆదేశాలు రాగానే సరిచేస్తాం



జిల్లాలో కార్మికుల నుండి టీ నేతన్న యాప్ కోసం వివరాల నమోదు జరుగుతుంది. కార్మికులే స్వయంగా చేస్తున్నారు. పలు చోట్ల తప్పులు దొర్లినట్టుగా కార్మికులు మా దృష్టికి తీసుకువచ్చారు. అయితే టీ నేతన్న యాప్ వివరాల నమోదు పూర్తి అయ్యాక, పై అధికారుల నుండి ఆదేశాలు రాగానే వాటిని సరి చేసేందుకు చర్యలు మొదలుపెడతాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాం.

– గోవిందయ్య, చేనేత జౌళి శాక ఏడీ

ఆదిశిలా క్షేత్రం హుండీ ఆదాయం రూ.24లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, ఈఓ సత్యాచంద్రారెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.24,07,139 ఆదాయం వచ్చిందని, గతేడాదితో పోలిస్తే రూ.3,96,005ల ఆదాయం అధికమని ఆలయ చైర్మన్ ప్రహ్లద రావు తెలిపారు. చింతలాముని హుండీ ఆదాయం రూ.1,08,850 లభించినట్లు ఆయన పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో గట్టు భ్రమరాంబిక సేవాసమితి, అరెకటిక, ఆర్యవైశ్య, రేణుక ఎల్లమ్మ మహిళా సంఘం, ఎస్‌వీఎస్ సేవా సమితి మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తుమ్మలపల్లెలో విషాదఛాయలు


శ్రవణ్ కుమార్ రెడ్డి (ఫైల్)

రాజోళి: రాజోళి గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మలపల్లెలో సోమవారం విషాదఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉదేష్ రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు శ్రవణ్ కుమార్ రెడ్డి(25) హైదరాబాద్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు గ్రామానికి వచ్చిన యువకుడు ఆదివారం తిరుగుపయనమయ్యాడు. హైదరాబాద్ వెళ్లిన కుమారుడి కోసం కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే కలవలేదు. యువకుడి ఫ్రెండ్స్‌కు ఫోన్ చేసినా ఇంకా రాలేదని చెప్పారు. ఈలోగా మహబూబ్‌నగర్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. యువకుడి మరణ విషయం తెలిశాక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం


కృష్ణయ్య(ఫైల్)

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లికి చెందిన దాదిమల్లి కృష్ణయ్య(35) సోమవారం తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నట్లు పెద్దకొత్తపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. కృష్ణయ్యకు 11ఏళ్ల క్రితం గంట్రావుపల్లి గ్రామానికి చెందిన రాధికతో వివాహమైంది. వారు బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లారు. భార్యాభర్తలు తరుచుగా గొడవలు పడేవారు. ఇటీవల భార్యాభర్తలు హైదరాబాద్‌లో గొడవ పడడంతో ఆదివారం ముష్టిపల్లికి వచ్చి ఇంట్లో నిద్రించాడు. మనస్థాపానికి గురైన కృష్ణయ్య ఆదివారం మధ్యరాత్రి తన వ్యవసాయ పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయమే కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని చనిపోయిన కృష్ణయ్యను చూశారు. తండ్రి పెద్దచెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేసరిసముద్రం చెరువులో గుర్తుతెలియని మృతదేహం నీటిపై తేలియాడుతుండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

నాలుగేళ్ల చిన్నారి అదృశ్యం

జడ్చర్ల: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉప్పరి రేణు (04) అనే చిన్నారి అదృశ్యమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నర్వ మండలానికి చెందిన రాజు కొంతకాలంగా జడ్చర్లలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో గుడిసె వేసుకుని తన ఇద్దరు పిల్లలను ఇక్కడకు తీసుకువచ్చాడు. భార్య తమను విడిచి వెళ్లడంతో పిల్లలను తానే చూసుకొంటున్నట్లు వివరించాడు. ఈ క్రమంలోనే తాను కూలీ పనులకు వెళ్లగా.. తన కుమారుడు రేణును గుడిసె వద్ద విడిచి తన దగ్గరకు వచ్చాడని పేర్కొన్నాడు. వెంటనే గుడిసె వద్దకు వచ్చి చూడగా తన కుమార్తె రేణు కనిపించకుండా పోయిందన్నారు. కాగా 100కు డయల్ చేయడంతో స్థానిక పోలీసులు వచ్చి విచారించారు.

అంతిమ విజయం మనదే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ


గుడిగానిపల్లిలో విగ్రహాలు ఆవిష్కరిస్తున్న మందకృష్ణ మాదిగ, తదితరులు

ఊర్కొండ: ఎస్సీ వర్గీకరణ విషయంలో అంతిమ విజయం మనదే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం రాత్రి గుడిగానిపల్లిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, గౌతముబుద్ధుడు, జ్యోతిరావుపూలే, జగ్జీవన్‌రాం విగ్రహాలను మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ జరగనుందని, ఈ బిల్లు ఆమోదం, సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగ ఉప కులాలకు వంద సంవత్సరాల పాటు మేలు జరుగుతుంది అని పేర్కొన్నారు. అలాగే ప్రపంచానికి మార్గదర్శనంగా నిలిచిన గౌతమ బుద్ధుడు, అంబేద్కర్, జ్యోతిరావు పూలే, జగ్జీవన్‌రాం విగ్రహాలు ఆవిష్కరించడం తన అదృష్టం అన్నారు. కార్యక్రమంలో శాంతికుమార్, సర్పంచ్ రజిత, కృష్ణ, శివ, వీరస్వామి, జంగయ్య, రాజు, చంద్రకాంత్, కె.జంగయ్య, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేట- కొడంగల్ ఎత్తిపోతలకు సన్నాహాలు

- త్వరలోనే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు
- లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక
- గతంలోనే రూ.1,450 కోట్లు మంజూరు
- తాజాగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యేల వినతి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్/ నారాయణపేట: జిల్లాలో నారాయణపేట- కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలిస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధూసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి కలిసి విన్నవించారు. కొడంగల్, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం జీఓ నం.69ను అప్పటి ఏపీ సీఎం కిరణ్‌మార్‌రెడ్డి అనుమతి ఇచ్చినా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదని వెంటనే జీఓను అమలు చేసి పనులు ప్రారంభించి సాగునీరు అందించాలని ఎమ్మెల్యేలు కోరారు. జీఓ 69 పథకం ద్వారా ఇరిగేషన్ ప్రాజెక్టుకు అన్నివిధాల అనుమతులు ఉన్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఈ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

లక్ష ఎకరాలకు సాగునీరు

ఆర్‌బీఎస్ఐఎస్-1 కింద భూత్పూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 7.10 టీఎంసీ నీటిని ఎత్తిపోయడం ద్వారా నారాయణపేట, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు సమీప గ్రామాలకు తాగునీరు అందించడం ఈ పథకం ఉద్దేశం. ప్రతిపాదిత కొత్త ఆయకట్టులో భాగంగా కొడంగల్‌లో 53,745 ఎకరాలు, మక్తల్‌లో 25,783 ఎకరాలు, నారాయణపేటలో 20,472 ఎకరాలు చేర్చారు.

గతంలోనే నిధులు మంజూరు

ఈ పథకానికి 2014లోనే రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఆమోదం లభించింది. నారాయణపేట- కొడండల్ ఎత్తిపోతల స్కీం స్టేజ్-1 మంజూరుకు పరిపాలనా ఆమోదం లభించిందని, అలాగే రూ.133.86 కోట్లు విడుదలయ్యాయని ప్రతినిధి బృందం తెలిపింది. రెండు దశల్లో టెండర్లు వేయాలని నిర్ణయించగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ రకాల కారణాలతో నిర్లక్ష్యం చేసింది. తాజాగా ప్రాజెక్టును వీలైనంత త్వరగా మంజూరు చేసి అమలు చేసేలా చూడాలని ఎమ్మెల్యేలు కోరడంతో ప్రాజెక్టు పనులు మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సాగునీరు అందించి తీరుతాం

పాలమూరు ఎమ్మెల్యేల వినతి మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిత పథకాన్ని తీవ్రంగా పరిగణించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజల సాగు, తాగునీటి అవసరాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఒకవైపు కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. మరోవైపు నామమాత్రపు నిధులను వెచ్చించి పూర్తి చేయగలిగిన పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిని నిర్లక్ష్యం చేసిందని ఎద్దేవా చేశారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఇతర కారణాలతో ప్రాజెక్టులు పూర్తి చేయడంలో జాప్యం వాటి ఖర్చులను పెంచిందని మంత్రి దుయ్యబట్టారు.

సంగంబండకు రూ.9 కోట్లు

సంగంబండ రిజర్వాయర్‌కు రూ.9 కోట్లు మంజూరు చేయాలని, కోయిల్‌సాగర్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేల బృందం చేసిన వినతిని పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నారు. అలాగే ప్రాజెక్టు కోసం సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకపోవడంతో సంగంబండ విడుదల, పునరావాస ప్యాకేజీ పెండింగ్‌లో ఉందని ఎమ్మెల్యేలు వివరించారు. దాదాపు 9- 10 గ్రామాలకు ప్రయోజనం చేకూర్చే 'బండ' తొలగించి నీటి సరఫరా ప్రారంభించేలా పరిహారం మొత్తాన్ని విడుదల చేయాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు.

- మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల తాగు, సాగు నీటి అవసరాలు తీర్చేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి కోయిల్‌సాగర్‌కు అదనపు నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డిలు మంత్రిని కోరారు. మహబూబ్‌నగర్ నేతలు లేవనెత్తిన సమస్యలను ఉన్నతాధికారులతో చర్చించి పరిశీలిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అలాగే పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటి వనరులను గుర్తిస్తామని, ఎక్కడైతే నీటి విడుదల సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందో ఆ పనులు ప్రాధాన్యతపై పూర్తి చేస్తామని చెప్పారు.
- మక్తల్ నియోజకవర్గంలోని ముంపు గ్రామాలైన సంగంబండ, ఉజ్జెలి, నేరడ్‌గం, భూత్పూర్, అనుగొండ, దాదన్‌పల్లి, అంకెన్‌పల్లి ముంపునకు గురై ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అందుకు మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలో ముంపు గ్రామాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అగ్నిమాపక సిబ్బందికి బోట్ ట్రైనింగ్


కేసరి సముద్రం చెరువులో బోట్ ట్రైనింగ్ ఇస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి కృష్ణమూర్తి

నాగర్‌కర్నూల్ క్రైం: వరదలతోపాటు అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను రక్షించేందుకు అగ్నిమాపకశాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటారని అగ్నిమాపకశాఖ అధికారి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కేసరిసముద్రం చెరువులో అగ్నిమాపక శాఖ సిబ్బందికి బోట్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నీళ్లలో మునిగిపోయినప్పుడు, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సిబ్బంది బోట్ ట్రైనింగ్ ఇచ్చామని చెప్పారు.

రేపు రైతులతో శాస్త్రవేత్తల సమావేశం

కందనూలు: బిజినేపల్లి మండలం పాలెంలో ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆడిటోరియంలో బుధవారం ఉదయం 10 గంటలకు వేరుశనగ రైతులు, ఎగుమతిదారులతో ఇక్రిశాట్ శాస్త్రవేత్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ సహ పరిశోధన సంచాలకులు ఎం.మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూనె గింజలు ఎగుమతిని ప్రోత్సహించే మండలి అధికారులు ఈ కార్యక్రమానికి వస్తున్నారని, రైతులు, ఎగుమతులదారులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఇద్దరిపై కేసు నమోదు



అలంపూర్: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ పటేల్ భానోతు తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఉండవెల్లి మండలం బొంకూరుకు చెందిన వడ్డె రమేష్, వడ్డె ప్రతాప్ 55 కాటన్ల కర్ణాటక మద్యాన్ని కారులో అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారు. సోమవారం గ్రామ సమీపంలో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి మద్యంతో పాటు తరలించడానికి వినియోగించిన కారును సీజ్ చేసినట్లు వివరించారు. పట్టుబడిన మద్యం 475 లీటర్లు ఉందని.. దీని విలువ రూ.2.50 లక్షలని వివరించారు. వడ్డె రమేష్ పట్టుబడగా వడ్డె ప్రతాప్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్ గోవిందు, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం

కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు పట్టుకున్నామని ఎస్ఐ వెంకటేష్ తెలియజేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అయిజ పట్టణానికి చెందిన మండ్ల నర్సింహులు అయిజ మండలంలోని వివిధ గ్రామాల నుంచి 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి రాయచూర్‌కు బొలెరో వాహనంలో తరలిస్తున్నాడు. పోలీసులకు సమాచారం రావడంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీల్లో భాగంగా మండలంలోని మల్లాపురంతండా శివారులో పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

ఇసుక డంపులు సీజ్


రాజోళిలో ఇసుక డంపులు సీజ్ చేసిన అధికారులు

రాజోళి: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను అధికారులు సోమవారం సీజ్ చేశారు. రాజోళిలోని తుంగభద్ర నది సమీపంలో పలు చోట్ల అక్రమంగా ఇసుకను డంపులు చేశారనే సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు దాడులు చేసి వాటిని సీజ్ చేశారు. వాటికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసిన్నట్లు ఆర్ఐ శ్రీనువాసులు తెలియజేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మహమ్మదాబాద్: మండల పరిధిలోని మొకర్లాబాద్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దోమ మండలం మల్లెపల్లికి చెందిన దొడ్ల నర్సింలు 20 ఏళ్ల కిందట మొకర్లాబాదికి చెందిన పద్మమ్మని వివాహం చేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నాడు. తాను ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి తమ్ముడు ఆంజనేయులు, తన అన్నది ఆత్మహత్య కాదని, హత్యచేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టోర్నీ విజేత బళ్లారి


విన్నర్ జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

- ఫైనల్‌లో రాణించిన బళ్లారి బ్యాట్స్‌మెన్
- కిక్కిరిసిన స్టేడియం

అచ్చంపేట రూరల్: స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం ఎనిమిది రోజులుగా కొనసాగిన సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ-20 క్రికెట్ టోర్నీలో చివరికి విజేతగా మ్యాక్స్ క్రికెట్‌క్లబ్ బళ్లారి జట్టు నిలిచింది. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఫైనల్‌లో గ్రూప్- ఏ నుంచి బళ్లారి వర్సెస్ గ్రూప్-బీ నుంచి మన్నెవారిపల్లి సీసీ జట్లు తలపడ్డాయి. మ్యాక్స్ క్రికెట్ క్లబ్ బళ్లారి 46 పరుగులతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బళ్లారి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసింది. జట్టు బ్యాట్‌మెన్ శివరాజ్ 57(34 బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సులు), ఫైజాన్‌ఖాన్ 50 (33 బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సులు), కెప్టెన్ తాహ 48 (21 బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సులు)తో రాణించారు. ప్రత్యర్థి బౌలర్ అరవింద్ 4-0-31-3 వికెట్లు తీశాడు. అనంతరం 186 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మన్నెవారిపల్లి సీసీ 17.3 ఓవర్లలో 139 పరుగులకే వెనుతిరిగింది. జట్టులో వినయ్‌గౌడ్ 32, కేఆర్ 26, ధనుష్ 19, ప్రతీక్‌పవార్ 17 పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్లు అశోక్‌మెండీస్ 4-0-25-4, స్టాలిన్ 2-0-25-3, సాన్‌టోక్ 3.3-0-22-3 వికెట్లతో రాణించారు. దీంతో 46 పరుగుల తేడాతో బళ్లారి జట్టు టోర్నీ విజేతగా నిలిచింది. విన్నర్ జట్టు బళ్లారికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రూ.3లక్షల నగదుతో పాటు కప్‌ను అందించారు. అలాగే రన్నర్ జట్టుకు మన్నెవారిపల్లికి రూ.2లక్షల నగదుతో పాటు కప్‌ను ఉప్పునుంతల జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి అందించారు. టోర్నీ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా బళ్లారి కెప్టెన్ తహ షీల్డ్‌ను అందుకున్నారు.

ప్రయత్నంతోనే విజయం

గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే అన్నారు. బహుమతులను అందించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సీవీకే ఆల్ ఇండియా లెవన్ టీ-20 టోర్నీలో తాను రూ.6లక్షల నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు.

ఏసీబీ వలలో లైన్‌మేన్


పట్టుబడిన లైన్‌మేన్ జీవరత్నం

అయిజ: విద్యుత్ స్తంభం తొలగించేందుకు ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ లైన్‌మేన్ సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజలో సర్వే నం.733లో ఉన్న విద్యుత్ స్తంభం తొలగించాలని 2022 జనవరిలో వీరేష్ ఆచారి లైన్‌మేన్ జీవరత్నంను సంప్రదించాడు. అయితే రూ.1.35 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో వీరేష్ ఆయనకు అప్పడప్పుడు కొద్దికొద్దిగా డబ్బు ఇస్తూ వచ్చాడు. గతేడాది ఫిబ్రవరిలో లైన్‌మేన్ వీరేష్ ప్లాట్‌లో ఉన్న విద్యుత్ స్తంభం తొలగించాడు. ఆ తర్వాత రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో వీరేష్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. పథకం ప్రకారం సోమవారం అయిజలోని అపోలో ఫార్మసీ దుకాణంలో లైన్‌మెన్‌కు రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో నిందితుడిని హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు లింగస్వామి, జిలాని తదితరులు పాల్గొన్నారు. కాగా కిందిస్థాయి సిబ్బందే ఈ స్థాయిలో లంచాలు తీసుకుంటే, ఉన్నతస్థాయి అధికారులు ఇంకెంత తీసుకుంటారని పలువురు చర్చించుకుంటున్నారు. విద్యుత్‌శాఖలో ప్రతిపనికి ఓ లెక్క ఉందని, ఈ శాఖలో అవినీతిని పూర్తిగా అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

టమాటలో సస్యరక్షణ చర్యలు


సాగులో ఉన్న టమాట పంట(ఫైల్)

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: టమాట పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. జిల్లాలో ఉన్న అనుకూల పరిస్థితుల్లో రైతులు టమాట సాగు చేశారు. టమాటలో ఆకు తొలుచు పురుగు ఆశించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పురుగు ఆశిస్తే పంట యొక్క ఆకులను పూర్తిగా తినేస్తుంది. ఆకులనే కాకుండా మొగ్గలు, కాయలకు ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. దీని వలన 50 నుంచి 100 శాతం వరకు నష్టం జరగవచ్చని తెలిపారు. దీనిని ఆకు తొలుచు పురుగు లేదా పిని వామ్ అంటారని పేర్కొన్నారు. దీని శాస్త్రీయ నామం టూట అబ్సలూట్. ఇది అమెరికా ప్రాంతానికి చెందినది. ప్రస్తుతం మన ప్రాంతాల్లో ఈ పురుగును గుర్తించారు.

నష్టపరిచే విధానం

రెక్కల పురుగు 7 నుంచి 8 మిల్లీ మీటర్ల పొడవు ఉండి గోధుమ లేదా బూడిదరంగులో ఉంటాయి. తల్లి పురుగులు లేత ఆకుల కింద, తొడిమల కింద సుమారు 200 గుడ్ల వరకు పెడుతుంది. వీటి నుంచి వచ్చిన పిల్ల పురుగులు లేత ఆకులపై వంకర టింకర సొరంగాలు చేసి ఆకుపచ్చని పదార్థాన్ని తినేస్తాయి. వీని వలన కణాలు తెల్లబారిపోతాయి. ఈ పురుగు లేత ఆకు కాండం, మొగ్గలు, పచ్చి కాయలపై రంధ్రాలు చేసి ఆశించడంతో కాయ కుళ్లు వాసన వస్తుంది. ఈ పురుగులు తక్కువ సమయంలో ఎక్కువ పునరుత్పత్తి జరిగి అధిక సంఖ్యలో ఉండటంతో అధిక నష్టం కలుగుతుంది.


టూట ఆశించిన ఆకు, టమాట

నివారణ ఇలా..

పురుగు లార్వాలు ఆకుల లోపల ఉండటంతో రసాయన మందులతో నివారించడం చాల కష్టం. సమగ్ర సస్యరక్షణ చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి.

- ప్రతి సారి ఒకే పొలంలో టమాట సాగు చేయరాదు. పంట చుట్టూ కంచె పంటగా జొన్న, మొక్కజొన్న నాలుగు సాళ్లు నాటితే వాటిపై ఈ పురుగులు చేరుతాయి. దీంతో కొంత వరకు పురుగులను నివారించవచ్చును.
- పొలం వెంబడి, గట్ల వెంట ఉమ్మెత్త మొక్కలు లేకుండా చూడాలి. లేకపోతే ఈ మొక్కలు పురుగులకు అతిథ్యం ఇస్తాయి.

లింగాకర్షక బుట్టలు

మగ పురుగులను ఆకర్షించే లింగాకర్షక బుట్టలను ఎకరానికి 8 అమర్చుకుంటే మగ పురుగులను నియంత్రించవచ్చు. ఎందుకంటే మగ పురుగులు లేకపోతే సంతానోత్పత్తి వృద్ధికాక పురుగు మనుగడ సాధించలేదు.

పసుపు రంగు అట్టలకు జిగురు

ఏ పురుగునైన ఆకర్షించే గుణం పసుపు రంగు అట్టలకు అధికంగా ఉంటుంది. పసుపు రంగు అట్టలకు గ్రీసు, జిగురు పట్టించి పొలంలో కర్రలకు కడితే రెక్కల పురుగుల వాటికి అతుక్కుని చనిపోతాయి.

రసాయన పద్ధతులు

ఈ పురుగులకు రసాయనాలకు త్వరగా తట్టుకునే శక్తి ఉంటుంది. ఎక్కువ సార్లు ఒకే రసాయనం వాడకుండా సూచించిన మందులను మార్చి పిచికారి చేసుకోవాలి. సైనోసాడ్ 0.3 మి.లీ, కొరాజెన్ 0.3 మి.లీ, డెల్టా మెత్రిన్ 0.5 మి.లీ, ప్రొఫినోఫాస్ 1.5 మి.లీ, వేప నూనె 5 మి.లీ లేదా, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 1.5 గ్రాములను లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళలో పిచికారి చేయాలి.

పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు

మాగనూర్: పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానాను జిల్లా కోర్టు న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ సోమవారం విధించినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నేరెడుగాం గ్రామానికి చెందిన బాలరాజు ఓ బాలికను ఎత్తుకెళ్లిపలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ నరేందర్ ఎఫ్ఐఆర్ నమోదు చేయగా అప్పటి సీఐ సీతయ్య కేసు విచారణ జరిపి కోర్టులో చార్జీషట్ వేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మురళీకృష్ణ, ఆకుల బాలప్ప, కోర్టు లైజన్ అధికారి బాలకృష్ణ, కోర్టు డ్యూటీ ఆఫీసర్ల సాయంతో 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించగా న్యాయమూర్తి శిక్ష ఖరారు చేయడంతో పాటు బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాలని తీర్పునిచ్చారు. కేసు విచారణ చేపట్టిన సిబ్బందిని ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించడంతో పాటు త్వరలో రివార్డ్స్ అందజేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...



అధునాతన ప్రభుత్వ పాఠశాలను
చూసి ఆశ్చర్యపోయా
ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

సాక్షి, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ (ట్విట్టర్) వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. సోమవారం ఆయన స్వగ్రామం బాపట్లకు సమీపంలోని కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, తరగతి గదుల్లో విద్యార్థుల బల్లలపై కూర్చుని, ఫొటోలు దిగి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. 'అందంగా, అధునాతనంగా మారిన కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను చూసి నాకు చాలా సంతోషంగాను, ఆశ్చర్యంగా అనిపిస్తోంది' అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సర్వీస్ నిబంధనపై హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన పీజీ విద్యార్థులు ఓ ఏడాది పాటు ప్రభుత్వ సర్వీస్ చేయాలని, అలా చేయకుంటే రూ.50 లక్షలు జరిమానా చెల్లించాలన్న సర్కార్ నిబంధనపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అలాగే ప్రభుత్వ సర్వీసు నిమిత్తం కేటాయించిన సంబంధిత కాలేజీల్లో చేరాలంటూ వైద్యవిద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను కూడా నిలిపివేసింది. సూపర్ స్పెషాలిటీ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ సర్వీసు చేయాలని, లేని పక్షంలో రూ. 50 లక్షలు జరిమానా చెల్లించాలని... ఈ మేరకు అంగీకారం తెలుపుతూ బాండ్ సమర్పించాలన్న నిబంధనను సవాలు చేస్తూ డాక్టర్ అన్వేష్‌కుమార్‌రెడ్డి మరో 22 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రావణ్ కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పై రెండు అంశాలపై స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు పిటిషనర్లకు మాత్రమే వర్తిస్తాయన్నారు. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 14కు వాయిదా వేశారు.

ఏపీ స్కూళ్లలో పెరిగిన చేరికలు

టాప్-4 రాష్ట్రాల్లో ఏపీకి తొలిస్థానం

- సంస్కరణలతో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్కూళ్ల స్థాయిలో భారీ పెరుగుదల
- జాతీయ స్థాయిని మించి ఏపీలో స్థూల నమోదు నిష్పత్తి పెరుగుదల
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 2021 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (పిల్లలు చేరికలు)లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2017తో పోలిస్తే 2021లో దేశంలోని స్థూల నమోదు నిష్పత్తి పెరిగిన టాప్‌- రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలిస్థానంలో ఉందని ఆ నివేదిక తెలిపింది. అలాగే, 2021లో జాతీయ స్థూల నమోదును మించి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక స్థూల నమోదు ఉందని కూడా పేర్కొంది. 2017తో పోలిస్తే.. 2021లో రాష్ట్రంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి భారీగా పెరిగిందని కూడా నివేదిక తెలిపింది.

'అమ్మఒడి' ప్రోత్సాహంతోనే..

స్థూల నమోదు నిష్పత్తిలో టాప్ నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తరువాత ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ఉండగా.. స్థూల నమోదు 2017తో పోలిస్తే 2021లో తగ్గిన నాలుగు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, బిహార్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2017తో పోలిస్తే 2021లో ప్రైమరీలో 18.4 శాతం, అప్పర్ ప్రైమరీలో 13.4 శాతం, ఎలిమెంటరీలో 16.5 శాతం స్థూల నమోదు పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఇందుకు ప్రధాన కారణం బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. అన్ని వర్గాల్లోని పేదల తల్లిదండ్రులకు తమ పిల్లల చదువులు భారం కాకూడదనే దూరదృష్టితో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకం అమలుచేస్తోంది. ఈ పథకం అమలు ద్వారా పేద వర్గాల పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా ప్రోత్సాహం అందిస్తోంది. జగనన్న అమ్మఒడి ద్వారా పిల్లలను స్కూళ్లకు పంపితే ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో అన్ని వర్గాల్లోని పేదలు తమ పిల్లలను స్కూళ్లకు పంపుతున్నారు.

స్థూల నమోదు వృద్ధికి దోహదపడిన సంస్కరణలు..

- మనబడి నాడు–నేడు ద్వారా తొలిదశలో.. 15 వేలకు పైగా ప్రభుత్వ స్కూళ్లలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు.
- రెండో దశలో మరో 22,221 స్కూళ్ల రూపురేఖలను మార్చే పనులు చేపట్టారు.
- దీంతోపాటు.. పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా చర్యలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. పిల్లలు ఎవరైనా స్కూళ్లకు వెళ్లకపోతే వలంటీర్లు ఆ పిల్లల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి కారణాలు తెలుసుకుని తిరిగి స్కూళ్లకు వచ్చేలా ప్రభుత్వం చర్యలను తీసుకుంది.
- స్కూళ్లకు వచ్చే పిల్లలకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోంది.
- పేద పిల్లల చదువులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు తల్లిదండ్రులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా కిట్‌ను అందిస్తోంది.
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంను కూడా అమలుచేస్తోంది. పిల్లలకు ట్యాబులను కూడా అందిస్తోంది. ఈ చర్యలన్నీ కూడా పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి పెరగడానికి దోహదం చేశాయి.

రాజ్యసభ 3 స్థానాలూ వైఎస్సార్‌సీపీకే..



సాక్షి, అమరావతి: ఏపీలో వచ్చే ఏప్రిల్ 2న ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీకే దక్కనున్నాయి. గతంలో రాష్ట్ర కోటాలో రాజ్యసభకు ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), సీఎం రమేష్ (బీజేపీ)ల పదవీకాలం ఏప్రిల్ 2తో పూర్తికానుంది. వీటికి ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారు. ప్రస్తుతం శాసనసభలో ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరడం ఖాయం. దీంతో రాష్ట్ర కోటాలో మొత్తం 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ పరమవుతాయి. అంటే.. ఏప్రిల్ 2 తర్వాత రాజ్యసభలో టీడీపీ ఉనికే లేకుండాపోతోంది. ఆ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకూ 41 ఏళ్లలో రాజ్యసభలో టీడీపీకి ప్రాతినిధ్యం లేకుండా పోవడం ఇదే ప్రథమం అవుతుంది. ఇక రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతం ఆ సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని దేశంలోని రాష్ట్రాల ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. మన రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 స్థానాల్లో ఘన విజయం సాధించింది. టీడీపీ 23 స్థానాలకే పరిమితమైంది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సత్సంబంధాలు నెరిపి.. అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేష్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు చక్రం తిప్పారు. రాష్ట్ర కోటాలో ఎన్నికై న రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీకాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఈ ఎనిమిది స్థానాలు వైఎస్సార్‌సీపీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి సీఎం జగన్ చాటిచెప్పారు.

దివ్యాంగుడికి 'గోవర్ధన' నిలయం

- దివ్యాంగుడికి ఇల్లు కట్టించి ఇచ్చిన మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- రూ.10 లక్షల సొంత డబ్బు వెచ్చించి



గంప గోవర్ధన్ కట్టించి ఇచ్చిన ఇల్లు



కామారెడ్డి క్రైం: నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రధాన రహదారిలో.. కామారెడ్డి మున్సిపల్ పరిధి పాత రాజంపేటలోని రైల్వే గేటు పక్కనే ఓ చిన్న పూరి గుడిసె ఉండేది. వర్షం పడినప్పుడల్లా ఇళ్లంతా కురవడంతో నీరు చేరి అందులోని ఓ దివ్యాంగుడు, కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్డు మీదుగా వెళ్తున్నప్పుడల్లా వారి అవస్థలను మాజీ ఎమ్మెల్యే, అప్పటి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గమనించేవారు. ఈ క్రమంలో 8 నెలల క్రితం గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన గంప గోవర్ధన్ వద్దకు రెండు కాళ్లులేని దివ్యాంగుడు షేక్ ఖాదర్ వెళ్లి తన గోడును వెళ్లబోసుకున్నాడు. వెంటనే స్పందించిన గోవర్ధన్ మీ అవస్థలను గమనించానని, మీకు సొంతిళ్లు కట్టిస్తానని మాట ఇచ్చారు. వెంటనే రూ.10 లక్షలు తన సొంత డబ్బును వెచ్చించి 80 గజాల విస్తీర్ణంలో హాలు, కిచెన్, బెడ్‌రూం, ఇతర అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తయిన ఆ పక్కా ఇంటిని గోవర్ధన్ ఆదివారం ప్రారంభించారు. సొంత డబ్బుతో ఇంటిని నిర్మించి ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఔదార్యంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..: గంప గోవర్ధన్

రైల్వే గేటు సమీపంలోని గుడిసెలోకి వర్షం నీరుచేరి దివ్యాంగుడు ఖాదర్, కుటుంబం ఇబ్బంది పడటం చాలా సార్లు గమనించాను. అతనికి ఏదైనా సహాయం చేయాలనుకున్నా. మరో చోట ఇల్లు కట్టిస్తానంటే వద్దన్నాడు. దాంతో గుడిసె ఉన్న స్థలంలోనే సొంత డబ్బుతో ఇల్లు నిర్మించి ఇచ్చాను. ఓ దివ్యాంగుడికి సహాయపడినందుకు సంతృప్తిగా, సంతోషంగా ఉంది.

నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్‌బాబు

బోధన్: మూతపడిన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య ఉన్నత శాఖాధికారులు 10 మందితో కమిటీ వేసింది. కమిటీ చైర్మన్‌గా పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్‌గా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, పరిశ్రమల, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ కమిటీలో ఉన్నారు. ఈనెల 12న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 4ను జారీ చేసింది. బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని 1938లో నిజాం హయాంలో నెలకొల్పారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీల విస్తరణకు దోహదపడింది. 2002లో చంద్రబాబు హయాంలో బోధన్, ముత్యంపేట (జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఫ్యాక్టరీలను ప్రైవేట్ చేశారు. దీంతో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) రూపాంతరం చెందింది.

రెండు దరఖాస్తులు చాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎండీ, డీఎన్‌బీ ఇలా 67,802 పీజీ మెడికల్ సీట్లున్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయి రెండింటిలోనూ సీట్లను నీట్ ప్రవేశపరీక్ష ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం అఖిల భారత ర్యాంకు ఆధారంగా మెరిట్ జాబితాను తయారు చేస్తున్నారు. అభ్యర్థులు తమ రాష్ట్ర పరిధిలో దరఖాస్తు చేసుకున్నప్పుడు.. వారిని రాష్ట్ర కేటగిరీగా గుర్తించి, తదనుగుణంగా మెరిట్ జాబితాలను తయారు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం అన్ని మెడికల్ కాలేజీల్లోని 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు, డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించేది. అభ్యర్థులెవరైనా ఈ 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక రాష్ట్ర కోటా, రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఇతర సీట్లకోసం అభ్యర్థులు తమ సొంత రాష్ట్రాల్లోని కాలేజీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ అధికారులు కూడా.. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లోని సీట్లకు ఆలిండియా ర్యాంకుల ఆధారంగా మెరిట్ జాబితాలు తయారు చేసి అడ్మిషన్లు చేస్తారు.

ప్రైవేట్ సీట్లకూ జాతీయస్థాయి కౌన్సెలింగ్

ప్రస్తుతం రాష్ట్రాల్లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు ఆయా రాష్ట్రాల్లోనే కౌన్సెలింగ్ జరుగుతోంది. వాటిలో కన్వీనర్ కోటాకు వేరుగా, బీ కేటగిరీ, ఎన్నారై కోటాల సీట్లకు వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వీటిలోని ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ కౌన్సెలింగ్ కోసం వేర్వేరుగా దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తోంది. ఎన్ఎంసీ నిర్ణయం అమల్లోకి వస్తే.. ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కాలేజీల్లోని వివిధ కేటగిరీల సీట్లకు ఒకే దరఖాస్తు సరిపోతుంది, ఒకేసారి కౌన్సెలింగ్ జరుగుతుంది.

- ఉదాహరణకు తెలంగాణలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉన్న బీ కేటగిరీ సీట్లలో 85 శాతం స్థానికులకు కేటాయించగా, మిగతా 15 శాతం ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఏ రాష్ట్రం వారైనా పోటీపడొచ్చు.

ఈ ఓపెన్ కేటగిరీ రిజర్వేషన్లు వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఒకే దరఖాస్తు ద్వారా ఆయా రాష్ట్రాల్లోని కాలేజీల్లో ఎక్కడో ఒకచోట సీటు పొందవచ్చు. నచ్చినచోట చేరవచ్చని, లేకుంటే తదుపరి కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ఎన్ఎంసీ అధికారులు చెప్తున్నారు.

- గత ఏడాది దేశవ్యాప్తంగా 20.87 లక్షల మంది నీట్ యూజీ పరీక్ష రాశారు. మొత్తం 11,45,976 మంది అర్హత సాధించగా.. అందులో ఏపీ నుంచి 42,836, తెలంగాణ నుంచి 42,654 మంది ఉన్నారు.

హైదరాబాద్‌లో యువకుడి బలవన్మరణం

- జీరో ఎఫ్ఐఆర్ నమోదు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో ఉరేసుకొని మృతిచెందాడు. తండ్రి స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన పానుగంటి చెన్నయ్య కుటుంబం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివాసం ఉంటోంది. చెన్నయ్య కుమారుడు పానుగంటి సాయికృష్ణ (23) కొన్నాళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. ఆదివారం రాత్రి తాగి ఇంటికి రావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన సాయికృష్ణ ఇంట్లోని స్నానాల గదిలో ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వెదకగా బాత్రూంలో తాడుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేసినట్లు ఎస్ఐ వివరించారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం నీటిమట్టం 1,020 అడుగుల మేర కొనసాగుతోంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- ఫిబ్రవరి 10 నుంచి గంగాపూర్ జాతర
- ఆలయంలో కొనసాగుతున్న పెయింటింగ్, శుద్ధి
- టెంకాయలు, తలనీలాలు, కొబ్బరిచిప్పల టెండర్లు పూర్తి

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబవుతుంది. ఫిబ్రవరి 10న మాఘమాసంలో ప్రారంభమయ్యే ఉత్సవాలు అదే నెల 18తో ముగియనున్నారు. జాతర కోసం ఆలయ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో పెయింటింగ్, శుద్ధి చేసే ప్రక్రియ కొనసాగుతుంది. గర్భగుడి, రాజగోపురం ఇతర ప్రాకారాలకు అవసరమైన రంగులు వేయటం, నీటితో శుద్ధి చేస్తున్నారు. కల్యాణ మంటపానికి పెయింటింగ్ పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణం, వెనకాల భక్తులు వంటావార్పు చేసుకునేందుకు గాను చదునుచేసి సిద్ధంగా ఉంచారు. కోనేటిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు పాతనీటిని బయటకు పంపించి కొత్త నీటిని నింపుతున్నారు.

అన్నిశాఖలకు సమాచారం

బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉండటంతో ముఖ్య శాఖల అధికారులకు ఇప్పటికే సమాచారం అందించారు. కలెక్టర్, ఆర్డీఓ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్టీసీ, పోలీస్, మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులకు కార్యనిర్వహణ అధికారి దీప్తి సారథ్యంలో సిబ్బంది సమాచారం అందించారు. జనవరి 31తో పంచాయతీ పాలకవర్గం గడువు ముగుస్తుండటంతో ఈ బ్రహ్మోత్సవాల నిర్వహణ భారం అధికారులపైనే పడనుంది.



కల్యాణ మండపానికి పెయింటింగ్ పనులు



ఆలయ ప్రాకారాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

వేలం పాటలు పూర్తి

బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయంలో తలనీలాలు, ప్రసాదం విక్రయాలు, కొబ్బరికాయల విక్రయాలు, కొబ్బరి చిప్పల వేలం పాటలు పూర్తయ్యాయి. తలనీలాలు, ప్రసాదాలకు సంబంధించిన టెండరు మూడు పర్యాయాలు ఆలయం, మహబూబ్‌నగర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన పూర్తి కాలేదు. శనివారం హైదరాబాద్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో వీటి టెండరు పూర్తయ్యింది. లడ్డు ప్రసాదాల విక్రయాలకు సంబంధించి కాకర్లపాడ్ చెందిన శేరి వెంకటయ్య రూ.21లక్షలకు, తలనీలాల టెండరు గంగాపురం చెందిన మహిపాల్‌రెడ్డి రూ.16.34లక్షలకు దక్కించుకున్నారు. కొబ్బరికాయల టెండరు రూ.5లక్షలకు మహబూబ్‌నగర్ వ్యక్తి, కొబ్బరి చిప్పల వేలం దేవరకద్రకు చెందిన వ్యక్తి రూ.1.45లక్షలకు దక్కించుకున్నారు.

రిజర్వాయర్ రద్దు చేయాలని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

- ఎమ్మెల్యే కారుకు అడ్డుగా కూర్చొని నిరసన
- రైతులకు నష్టం వాటిల్లకుండా న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ

బల్మూర్: మండలంలోని అనంతవరం, బల్మూర్ గ్రామాల సమీపంలో నిర్మించబోయే ఉమామహేశ్వర రిజర్వాయర్ అనుమతులను రద్దు చేయించాలని సోమవారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే వంశీకృష్ణతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ గోడును వినిపించారు. తామంత ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద వర్గాలకు చెందిన సన్న కారు రైతులమని, తమ భూములే 1,800 ఎకరాలు రిజర్వాయర్‌లో కోల్పోతున్నామని వాపొయ్యారు. దీంతో తమ బతుకులు బజారున పడటం ఖాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రిజర్వాయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఉమామహేశ్వర రిజర్వాయర్‌తో గ్రామాల్లోని ఇళ్లకు ఎలాంటి నష్టం వాటిల్లదని చెప్పారు. పాత డిజైన్ 2.5 టీఎంసీల నుంచి 2 టీఎంసీలకు కుదించి అధికంగా భూములు కోల్పోకుండా రైతులకు నష్టం జరగకుండా చూస్తామన్నారు. దీనిపై రైతులకు బాసటగా సీఎంతో మాట్లాడుతానని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో పాటు నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా అధిక ప్యాకేజీ కల్పిస్తామన్నారు. గతంలోనే ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణం కోసం టెండర్లు కూడా పూర్తి చేసిందని, తనపై రాజకీయ ఉద్దేశంతో సోషల్ మీడియాలో రిజర్వాయర్‌పై కొందరు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

రైతుల నిరసన...

ఈ ప్రాంతంలో ఎలాంటి రిజర్వాయర్ వద్దని, దానిని రద్దే చేయాలని రైతులు ఎమ్మెల్యే కారుకు అడ్డుగా కూర్చొని నిరసన తెలిపారు. దీంతో ఎమ్మెల్యే కారు దిగి మరో కారులో వెళ్లిపోయారు. ఎమ్మెల్యే తమకు అండగా న్యాయం చేయాలని కోరారు.

డిజిటల్ మార్కెటింగ్‌తో జీవనోపాధి మెరుగు



డిజిటల్ మార్కెటింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ గిరిజ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుత ఆధునిక కాలంలో డిజిటల్ మార్కెటింగ్ అనేది ప్రతిఒక్కరి జీవితంలో భాగంగా మారిందని పీయూ రిజిస్ట్రార్ గిరిజ అన్నారు. సోమవారం పీయూ ఆడిటోరియంలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'డిజిటల్ మార్కెటింగ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో ఆమె మాట్లాడారు. డిజిటల్ మార్కెట్ వల్ల మారుమూల ప్రాంతాల్లో తయారు చేసిన వస్తువులు కూడా ఆన్‌లైన్‌లో అమ్ముకుని, జీవనోపాధి పొందే అవకాశం ఉందన్నారు. డిజిటల్ మార్కెటింగ్ వల్ల బిజినెస్ స్వరూపమే మారిపోయిందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులు చేతన్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతీది ఆన్‌లైన్‌లోకి వెళ్లిందని, మానవ కార్యకలాపాలను ఇంటర్నెట్ సులభతరం చేసిందని, ఆన్‌లైన్ షాపింగ్, టికెట్ బుకింగ్ వంటి అనేక అంశాల్లో ఆన్‌లైన్ సహాయపడుతుందన్నారు. 80 శాతం మంది ప్రజలు ఆన్‌లైన్‌లో కొనుగోలు, అమ్మకాల కోసం వెతుకుతున్నారని ఒక పరిశోధనలో తేలింది అంటే ఇంటర్నెట్ ప్రభావం ఏ మేరకు ఉందో తెలుస్తుందన్నారు. విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవడం వల్ల మెరుగైన ఉపాధి, ఉద్యోగ, అవకాశాలు పొందే ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణయ్య, కంట్రోలర్ రాజ్‌కుమార్, అర్జున్, నాగసుధ, జావెద్, అరుంధతిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో విజేతగా నిలవాలి



జిల్లా రగ్బీ క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ రగ్బీ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో రగ్బీ క్రీడను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిరంతరం క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తే నైపుణ్యం గల క్రీడాకారులుగా ఎదగవచ్చని అన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయికి చేరుకోవాలని కోరారు. క్రీడాపోటీల్లో ఓడిన వారు నిరాశచెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. రగ్బీ ఎంపికలకు దాదాపు 80 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరిలో వచ్చేనెల 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రగ్బీ టోర్నమెంట్ ఉంటుందని చెప్పారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉమాపతిరెడ్డి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సూర్యప్రకాశ్, పీఈటీలు మొగులాల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాల పేదలకు వరం

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

మరికల్: మండలంలోని కన్మనూర్‌లో ఆయుర్వేద వైద్యశాల ఏర్పాటు ఉమ్మడి జిల్లా ప్రజలకు వరమని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామంలో ఎంపీ నిధులతో అత్యాధునిక వసతులతో నిర్మించిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, ఆయుష్ హెల్త్, వెల్‌నెస్ కేంద్రాన్ని సోమవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యాధునిక వసతులతో రెండో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఇక్కడ నిర్మించామన్నారు. ఇక్కడ పక్షవాతం, కిడ్నీలో రాళ్లు, అర్షమొలలు, మధుమేహం, స్త్రీ వ్యాధులు, కీళ్ల నొప్పులు, కామెర్లు, చర్మవ్యాధులతో పాటు అన్నిరాకల దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందిస్తారని.. ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశాలను పూర్తిస్థాయిలో నడిపించాలంటే వైద్యులు అవసరమని స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నవించగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సదుపాయలను పరిశీలించి సర్పంచ్ శరత్‌చంద్రారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, వైద్యులు వసంత్‌రావు, పరమేశ్వర్‌రావు, సర్పంచ్ శరత్‌చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వీరన్న, చెన్నయ్య పాల్గొన్నారు.